రెఫరెండం అన్నోళ్లు రైతుల దగ్గరికి ఎందుకు పోరు?

- **నేనొక రైతుబిడ్డగా చెప్తున్నా..**
- **రాష్ట్రంలో రైతుల బాధలు వర్ణనాతీతం**
- **తెలంగాణకు ఈ ఎన్నికలు చరిత్రాత్మకం**
- **కాంగ్రెస్, బీజేపీకి తెలంగాణ ప్రయోజనాలు పట్టవు**
- **10 ఏండ్ల ఆ పార్టీల వైఖరే నిదర్శనం**
- **తెలంగాణ హక్కుల కోసం కొట్లాడేది బీఆర్ఎస్ ఒక్కటే**
- **కేసీఆర్‌పై ప్రజల్లో ఆదరణ పెరిగింది**
- **'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): 'ఈ ఎన్నికలను రెఫరెండంగా స్వీకరించే ధైర్యం కాంగ్రెస్‌కు ఉంటే.. రైతుల కన్నీటిని ఎందుకు తుడవడం లేదు.. వారి బాధను ఎందుకు పట్టించుకోవడం లేదు?' అని ప్రశ్నించారు బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ప్రస్తుత ఖమ్మం పార్లమెంట్ స్థానం అభ్యర్థి నామా నాగేశ్వర్‌రావు.. 'నేనొక రైతుబిడ్డగా చెప్తున్నా.. రాష్ట్రంలో రైతుల బాధలు వర్ణనాతీతం'అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, పరిరక్షణ బీఆర్ఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవితను నిర్దేశించేవిగా అభివర్ణించారు. రాష్ట్రం నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు, వీరిలో ఒకరు కేంద్ర మంత్రిగా చేసినా, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలున్నా తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికంటే ఇప్పుడింకా ప్రజల్లో ఆయనపై ఆదరాభిమానాలు పెరిగాయన్న ఆయన, ఎన్నికల ప్రచార సరళి, స్పందన తదితర అంశాలపై 'నమస్తే తెలంగాణ'కు శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

నమస్తే తెలంగాణ: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతున్నది? ప్రజల స్పందన ఎలా ఉంది?

నామా: దాదాపు 25 రోజులుగా మా పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇప్పటివరకు 23 మండలాలను కవర్ చేశా. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారు. రైతులు, మహిళలు, వృద్ధులంతా తమ సమస్యలు చెబుతూ బాధపడుతున్నారు. రైతుబంధు ఇంకా అందరికీ రాలేదు. మాకు మేం చెప్పుకోవద్దు కానీ రైతుల్లో కేసీఆర్‌పై ఆదరణ, అభిమానం వారు సీఎంగా ఉన్నదానికంటే ఇప్పుడింకా పెరిగింది. 'పదేండ్లపాటు మాకు ఏ కష్టం రాకుండా కేసీఆర్ చూసుకున్నారు. ఠంచనుగా రైతుబంధు వచ్చింది. పంట కొనుగోలు చేసి వారం తిరక్కముందే మా ఖాతాల్లో డబ్బులు పడేవి. ఇప్పుడా పరిస్థితి లేదు' అని రైతులు గుర్తుచేస్తున్నారు. 'కాంగ్రెస్ పార్టీ రైతుబంధు రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచుతాం, రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం, క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని మాయమాటలు చెప్పి మమ్మల్ని మోసం చేసింది' అని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. రైతులే కాదు, మహిళలకు నెలకు రూ. 2500 చెల్లిస్తామని, పింఛన్లు రూ.4వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని కోపంతో ఉన్నారు. 'ప్రజల్లో మేం ముఖం చూపకుండా అయింది' అని కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అంటున్నారు.

ఉమ్మడి ఖమ్మంలో మీ పార్టీ నుంచి గెలిచిన ఓ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరారు.. ఆ ప్రభావం మీ ప్రచారంలో ఏమైనా కనిపిస్తుందా?

ఎలాంటి ప్రభావం లేదు. పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. కష్టపడే కార్యకర్తలు మా పార్టీలో ఉన్నారు. నాకన్నా ఎక్కువ కష్టపడి సమన్వయంతో పనిచేస్తున్నారు.ఒక ఎమ్మెల్యే పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలు, ప్రజలు మారరని గత అనుభవాలు చెబుతున్నాయి. రైతుల కష్టాలు, ప్రభుత్వంపై వ్యతిరేకతను చూసి అనవసరంగా పార్టీ మారాననే భావన వారిలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఆ ఎమ్మెల్యే సెగ్మెంట్ నా లోక్‌సభ పరిధిలోకి రాదు. అక్కడా ఆ ప్రభావం పెద్దగా ఉంటుందని నేను అనుకోను.

మాది జాతీయ పార్టీ.. మేం గెలిస్తేనే తెలంగాణకు మేలు అని కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తున్నాయి. దీనిపై మీరేమంటారు?

అదంతా పచ్చి అబద్ధం. ఆ రెండు పార్టీల దగాకోరు మాటలకు నిదర్శనం. నలుగురు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలతో రాష్ట్రానికి జరిగిన ప్రయోజనం ఏమిటో చెప్పమనండి. ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని మేం పార్లమెంట్ లోపలా బయటా అందోళన చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఏమీ పట్టనట్టు వ్యవహరించారు. ప్రధానంగా రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని మేం పట్టుబడితే మమ్మల్ని చూసి వెకిలిగా నవ్వారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యం. నేను ఇద్దరు ఎంపీలతో కేసీఆర్ రాష్ట్రాన్నే సాధించారు. తొమ్మిది మంది ఎంపీలతో లోక్‌సభనే స్తంభింపజేసి రాష్ట్ర ప్రయోజనాలకు రక్షణగా నిలిచాం. ఇప్పుడు అంతకన్నా ఎక్కువ స్థానాలు గెలవాల్సిన అవసరం ఉన్నది. గెలిచే అవకాశాలూ ఉన్నాయి.

బీఆర్ఎస్ గెలిస్తే కేంద్రంలో అధికారంలోకొచ్చేది ఉందా? ఆ పార్టీకి ఓటేయడం ఎందుకు? మాకు వేస్తే అధికారంలోకి వస్తామని కాంగ్రెస్, బీజేపీ ప్రచారం చేస్తున్నాయి. దీనికి మీరేమంటారు?

ఇంతకు ముందే చెప్పిన.. మళ్లీ మళ్లీ చెప్తున్న. కాంగ్రెస్‌కు ఓటేయకుంటే రాష్ట్రంలో అధికారం పోయేదేం లేదు. బీజేపీకి ఓటేయకుంటే ఆ పార్టీకి జరిగే నష్టమేం లేదు. కానీ, బీఆర్ఎస్‌కు ఓటేయకుంటే తెలంగాణకు మాత్రం కచ్చితంగా నష్టం జరుగుతుంది. పార్లమెంట్‌లో తెలంగాణ ప్రయోజనాల కోసం గొంతు చించుకొని కొట్లాడింది బీఆర్ఎస్సే. కేసీఆర్ హయాంలో ఎస్సీ వర్గీకరణ, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, బీసీ కులగణన, జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు, జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకున్నాం. వాటికి నిధులు తెచ్చుకోవడం, వీటితోపాటు విభజన హామీల అమలు కోసం చిత్తశుద్ధితో పోరాటం చేయగల సత్తా బీఆర్ఎస్‌కే ఉన్నది. గతం కంటే బీఆర్ఎస్ ప్రాతినిధ్యం పార్లమెంట్‌లో ఎక్కువ ఉండాల్సింది ఇప్పుడే.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లానే పార్లమెంట్ ఫలితాలుంటాయని కాంగ్రెస్ అంటున్నది. ఈ ఎన్నికలు మా పాలనకు రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వీటిని మీరెలా చూస్తారు?

కాంగ్రెస్ పార్టీది మేకపోతు గాంభీర్యం. నాలుగునెలల క్రితం ఇంతకన్నా మెరుగ్గా ఉంటుందని ప్రజలు భావించారు. కానీ, అంతలోనే ఇంత అధ్వానంగా కూరుకుపోతామని ప్రజలెవరూ అనుకోలేదు. ఏదో అనుకుంటే ఇంకేదో అయిందని బాధపడుతున్నారు. బంగారం లాంటి కేసీఆర్ పాలనను కాదని ఇప్పుడు బాధపడుతున్నామనే భావన అన్ని వర్గాల్లో కనిపిస్తున్నది. నిజానికి రెఫరెండంగా స్వీకరించే ధైర్యం కాంగ్రెస్‌కు ఉంటే రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా పట్టించుకోరా? డిసెంబర్ 9 నుంచే రైతు భరోసా అమలు చేస్తామని చెప్పి 100 రోజులు పూర్తయినా చేయరా? రూ. 2 లక్షల రుణమాఫీకి రైతులు గడువు ఆడిగారా? మాకు రూ.4వేల పింఛన్ పెంచాలని ఎవరైనా అడిగారా? కానీ, ఇప్పుడు మొహం చాటేసింది ఎవరు? అసలు రుణమాఫీకి మేం 100 రోజుల గడువే పెట్టలేదని అనేవాళ్లెవరు? వారికి తగిన సమాధానం చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

బలమైన రాష్ట్రాలు, బలమైన కేంద్రం అనేది భారత సమాఖ్య స్ఫూర్తి. కానీ, బలహీన రాష్ట్రాలు, బలమైన కేంద్రం అన్న ధోరణి రోజు రోజుకూ పెరుగుతున్నదనే వాదనకు ఓ సీనియర్ పార్లమెంటేరియన్‌గా మీ పరిశీలన?

ప్రపంచంలోని అనేక దేశాలకు అనేక రంగాల్లో మనం ఆదర్శం. అలాంటిది దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గడచిన పదేండ్లలో ఆ స్ఫూర్తిని క్రమంగా లేకుండా చేస్తున్నారు. రాష్ట్రాలు ఎంత బలంగా ఉంటే కేంద్రం అంత దృఢంగా ఉంటుంది. కానీ, గతంలో ఎప్పుడూలేనంతగా బీజేపీ ఆ స్ఫూర్తిని దెబ్బతీసింది. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది. రాష్ట్రాల చేతిలో ఏ అధికారం లేకుండా చేసి మొత్తం మేం చెప్పినట్టే వినాలి అనే ధోరణి కేంద్రంలో పెరిగిపోతున్నది. దీనికి ప్రాంతీయ పార్టీలే అడ్డుకట్ట వేస్తాయి. అలా అడ్డుకట్ట వేసే పార్టీలే ఉండకూడదనే భావనతో జాతీయ పార్టీలు ఉద్దేశపూర్వకంగా పనిచేస్తున్నాయి.

శనివారం బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్

చేవెళ్లలో ఎగిరేది గులాబీ జెండానే

- **మరోసారి బీఆర్ఎస్‌దే విజయం**
- **ప్రజల కష్టాలు తెలిసిన నేత కాసాని జ్ఞానేశ్వర్**
- **చేవెళ్ల నియోజకవర్గనేతల సమీక్షలో కేటీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరబోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై మరోసారి గులా బీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి చేవెళ్ల ప్రజలతో పాటు అన్ని వర్గాల నుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తున్నదని స్థానిక నాయకులు వివరించారు. 30 ఏండ్ల పాటు సమాజంలోని అన్ని వర్గాల కోసం పని చేసిన కాసాని జ్ఞానేశ్వర్‌కి ఈ ఎన్నికల్లో గెలుపు తథ్యమని కేటీఆర్ చెప్పారు. జ్ఞానేశ్వర్ గ్రామీణ ప్రాంతం నుంచి అంచలంచెలుగా ఎదిగారని, సుదీర్ఘ అనుభవం కలిగిన రాజకీయ నాయకుడని కేటీఆర్ గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా స్థానికుడు కావడంతో అక్కడి ప్రజల కష్టసుఖాలు, అన్ని ప్రాంతాలపైన ఆయనకు సంపూర్ణ అవగాహన ఉన్నదని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్ల బహిరంగ సభ తర్వాత జ్ఞానేశ్వర్ విజయం ఖాయమైందని, ఈ దిశగా అన్ని ప్రాంతాల నుంచి, అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తున్నదని తెలిపారు. చేవెళ్లలో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అధికారాన్ని అనుభవించి.. పార్టీకి, నాయకత్వానికి నమ్మకద్రోహం చేసి వెళ్లిన రంజిత్‌రెడ్డితోపాటు మహేందర్‌రెడ్డి వైఖరిని ప్రజలు అసహించుకుంటున్నారని స్థానిక నేతలు తెలిపారు. నిబద్ధతలేని నాయకులను ప్రజలు నమ్మరని, అధికారం కోసం జెండాలు మార్చే వాళ్లని తిరస్కరిస్తారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

రేవంత్, కేసీ, కనుగోలు రాష్ట్రాన్ని అమ్ముతున్నరు

- **రేవంత్‌కు పాలనపై ధ్యాస లేదు**
- **కేసీఆర్‌ను తిట్టడమే ఆయన పని..**
- **గ్యారెంటీల అమలు చూపిస్తే ముక్కు నేలకు రాస్తా**
- **బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ సవాల్**

హైదరాబాద్ తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సునీల్ కనుగోలు కలిసి రాష్ట్రాన్ని అమ్ముకుంటున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి పరిపాలనపై ధ్యాస లేదని, ఆయనకు కేసీఆర్‌ను తిట్టడమే పని అని ఎద్దేవాచేశారు. రాహుల్ గాంధీ గెలుపు కోసం వాయనాడ్‌లో రేవంత్ రెడ్డి ప్రచారం చేయాల్సిన దుస్థితికి కాంగ్రెస్ దిగజారిందని దుయ్యబట్టారు. ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని చెబుతూనే ఆయన కోసం రేవంత్ చేత ప్రచారం చేయించుకోవడం చూస్తేనే కాంగ్రెస్, రాహుల్ పరిస్థితి అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, ఎక్కడ అమలు చేశారో చూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని దాసోజు సవాల్ విసిరారు. ఢిల్లీకి కప్పం కట్టి పీసీసీ అధ్యక్ష పదవి తెచ్చుకున్న రేవంత్, సీఎం పదవిని కూడా అలానే తెచ్చుకున్నారని ఆరోపించారు. ఢిల్లీకి డబ్బులు పంపడంపైనే రేవంత్ ధ్యాస ఉందని, పిచ్చి పట్టినట్లు నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారని, చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, మార్పు అంటే ఏమిటో ఓసారి చూద్దామని ప్రజలు ఆ పార్టీకి ఓట్లేశారని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రేవంత్‌రెడ్డి హుందాగా చూడడం లేదని, నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచాడని మండిపడ్డారు. సిగ్గూ శరం లేకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటెయ్యాలని అడుగుతున్నాడని ధ్వజమెత్తారు. హామీలు ఒక్కటీ అమలు కాకున్నా, మరోసారి మోసం చేసేందుకు వస్తున్నాడని, రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చెయకుండా కక్షగట్టి పంట పొలాలను ఎండబెట్టిన ఘనత రేవంత్‌రెడ్డిదేనని విమర్శించారు. ప్రజా దర్బార్ పేరుతో ఒక్కరోజే ప్రజాభవన్‌లో కూర్చొని దానిని నిర్వీర్యం చేశాడన్నారు. రేవంత్ రెడ్డి రాజకీయ దళారి అని, ప్రజలపై ఆయనకు ఎలాంటి ప్రేమ లేదని, ప్రజా సమస్యలపై అవగాహనే లేదన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగను కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా నియమించుకున్నదని, ఆయన వయనాడ్‌లో రాహుల్ గాంధీని గెలిపించండి అని ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కేరళ ప్రజలు తెలివైన వాళ్లని, ఎవరికి ఓటు వేయాలో వారికి బాగా తెలుసునన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసే వాళ్లకు తండ్రి లాంటోడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు టికెట్ ఇవ్వకుండా మోసం చేశాడని సొంతపార్టీ నేతలే మండిపడుతున్నారని గుర్తుచేశారు. డబ్బులు తీసుకొని టికెట్ ఇచ్చే సంస్కృతి రేవంత్ రెడ్డిదని, ఎవరు డబ్బులిస్తే వారికి టికెట్లు అమ్ముకున్నాడని, అందుకే మాదిగలకు టికెట్ ఇవ్వలేదన్నారు. మొదటి కేబినెట్‌లో ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో ఎందుకు చోటివ్వలేదో చెప్పాలని, 14 ఎంపీ సీట్లు వస్తే ముదిరాజ్‌లకు మంత్రిపదవిస్తానని మరోసారి వారిని మోసం చేసేందుకు రేవంత్ సిద్ధమయ్యాడని దుయ్యబట్టారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు చనిపోతుంటే ప్రభుత్వం నుంచి ఒక్కరు కూడా వెళ్లి చూడలేదని, పాలమూరు బిడ్డలు ఒక్కసారి ఆలోచించాలని, 2014 కంటే ముందు పాలమూరు ఎలా ఉన్నది?, ఇప్పుడెలా ఉన్నది చూడాలని కోరారు. పాలమూరు ఎంపీగా ఉన్నప్పుడే కేసీఆర్ తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. 'కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కంచెలా కాపాడుకునుడేంది.. రేవంత్ రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివా?, గొర్రెల కాపరివా? సొంత పార్టీ ఎమ్మెల్యేపైనే నీకు నమ్మకం లేదా?' అని ప్రశ్నించారు. బీజేపీతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యాడని, ఆయన మోదీ ఏజెంట్ అని, ఏదో ఒక రోజు రేవంత్ బీజేపీలోకి వెళ్లడం ఖాయమన్నారు. రేవంత్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ నేత లక్ష్మణ్, ఆ పార్టీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఇప్పటికి పదిసార్లు అన్నారని, ఎంపీ అరవింద్ కూడా రేవంత్ రెడ్డి బీజేపీలోకి వస్తాడని బహిరంగంగానే వ్యాఖ్యానించారని, వాటిపై రేవంత్‌రెడ్డి ఇంత వరకూ స్పందించకపోవడం వెనుక అర్థమేమిటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి రాహుల్, మోదీ ఇద్దరికీ కన్ను కొడుతున్నాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మీద బట్టకాల్చి మీదేస్తే, కర్రు కాల్చి వాత పెట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

మాదిగలను తొక్కేస్తున్న రేవంత్

- **ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్**

ముషీరాబాద్, ఏప్రిల్ 20: అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా సీఎం రేవంత్ రెడ్డి మాదిగలను అణగదొక్కుతున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు కనీసం రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు దీక్ష చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ మల్లేశ్, శ్రీనివాస్, గణేశ్, రమేశ్, వరలక్ష్మి, వేణు, శ్రీనివాస్, వెంకట్, నందకిశోర్ పాల్గొన్నారు.

కరీంనగర్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి పమేల సత్పతికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్, ఎమ్మెల్యేలు గంగుల, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి

అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 20 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. శనివారం ఆయన కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీపై తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోశారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విరక్తి కలిగిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తిరిగి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా రాష్ట్రానికి నిధులు తేలేని దుస్థితి బీజేపీదని ఆరోపించారు. విభజన చట్టంలో లేని బీబీనగర్ ఎయిమ్స్ కళాశాలను పార్లమెంటులో పోరాడి తెచ్చామని చెప్పారు. కరీంనగర్‌ను రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి పాల్గొన్నారు.

'డబుల్' బిల్లులు ఇవ్వకుంటే ప్రాణత్యాగమే

- **కేసీఆర్ పాలనలో 400 కోట్లు ఇప్పించా**
- **26 కోట్లు ఇవ్వమంటే ప్రభుత్వం ఇస్తలేదు**
- **మాజీ స్పీకర్ పోచారం సంచలన వ్యాఖ్యలు**

సంగారెడ్డి కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్. చిత్రంలో పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి/సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 20: డబుల్ బెడ్రూం ఇండ్ల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయకపోతే ప్రాణత్యాగం చేస్తానని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్ ప్రభుత్వం ఉండగా బాన్సువాడ నియోజకవర్గానికి 11 వేల డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయించిన. లబ్ధిదారులకు రూ.400 కోట్ల బిల్లులు ఇప్పించిన. మరో రూ.26.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అవి మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేస్తే సరే అన్నారు. కానీ.. ఈ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆ మంత్రి దగ్గరికి వెళ్లి బిల్లులు ఇవ్వొద్దని చెప్పిండ్రు. నన్ను నమ్ముకుని పేదలు అప్పులు చేసి ఇండ్లు కట్టుకున్నారు. ఎన్నికల్లోపు బిల్లులు రాకపోతే మే 13 తర్వాత లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తా. అప్పటికీ స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా.. ప్రాణత్యాగం చేస్తా' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి నిజామాబాద్ జిల్లా పొతంగల్, కోటగిరి, రుద్రూర్ మండలాల్లో శనివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో పోచారం మాట్లాడారు.

హామీల పేరిట వంచించారు..

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించిందని, వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని పోచారం పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో వ్యవసాయానికి కరెంట్, సాగునీరు, పంట పెట్టుబడి, ధాన్యం కొనుగోలు సమస్యలు లేవని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముం దు పోచారం శ్రీనివాసరెడ్డి జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలను అందజేశారు. సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, దఫేదార్ రాజు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఓటమి భయం

- **రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌కు చుక్కెదురే**
- **మంచానపడ్డది నేను కాదు.. నువ్వే**
- **రేవంత్‌పై ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో ఓడిపోతామనే భయం సీఎం రేవంత్‌రెడ్డికి పట్టుకున్నదని, అందుకే పాలమూరు, వికారాబాద్ పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జిగా ఉండలేక పారిపోయాడని పాలమూరు సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో, కోయిలకొండ మండలం శేరి వెంకటాపూర్, నర్వ మండల కేంద్రంలో గులాబీ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. సమావేశాలకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి ఎంపీ మన్నె హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌కు వచ్చిన సీఎం రేవంత్ తనపై లేనిపోని ఆరోపణలు చేశారని, విమర్శలు సీఎం స్థాయికి తగవని అన్నారు. 'నేను మంచోడినని నువ్వేం కితాబు ఇవ్వాల్సిన అవసరం లేదు. మంచాన పడ్డది నువ్వు.. నేను కాదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని తెలిసే మతిభ్రమించి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నావ్' అని రేవంత్‌పై విరుచుకుపడ్డారు. మహబూబ్‌నగర్, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా సీఎం రేవంత్ ఎందుకు తప్పుకున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుసో.. తెలియకో ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో ప్రజలు సుభిక్షంగా బతికారని.. కాంగ్రెస్ పాలనలో నాలుగు నెలలకే కష్టాలు వెంటాడుతున్నాయని చెప్పారు. తాను ఎంపీ అయ్యాక తమ కంపెనీలో స్థానికులకు వెయ్యి ఉద్యోగాలు కల్పించానని, మళ్లీ గెలిపిస్తే ఇంకో వెయ్యి ఇస్తామని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు రేవంత్ చేసిందేమిటో వివరించాలని డిమాండ్ చేశారు.

సీఏఏపై సీఎం రేవంత్ వైఖరి చెప్పాలి

- **బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో గత ప్రభుత్వం తీర్మానం**
- **మాజీ మంత్రి మహమూద్ అలీ**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): సీఏఏపై కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి తమ వైఖరి చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత మహమూద్ అలీ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ సీఏఏకు వ్యతిరేకంగా కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వంద రోజులైనా మహిళలకు ఉచిత బస్సు మినహా మరే పథకం అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ, మైనార్టీలకు అన్యాయం చేస్తున్నదని, మంత్రివర్గంలో ముస్లింలకు చోటే కల్పించలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని ప్రభుత్వం, పోలీసులు వేధిస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి ఏం మాట్లాడుతున్నారో ఆమెకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో మార్పు మొదలైందని, బీఆర్ఎస్ 12 ఎంపీ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

మూడో రోజు 65 మంది అభ్యర్థుల నామినేషన్

మూడు రోజుల్లో 156 మంది నామినేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌లో భాగంగా మూడో రోజు శనివారం 65 మంది 77 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మూడు రోజుల్లో మొత్తం 156 మంది నామినేషన్ వేశారు. మెదక్‌లో ఎనిమిదిమంది, మల్కాజ్‌గిరి, నల్గొండలో ఏడుగురు చొప్పున, పెద్దపల్లిలో ఆరుగురు, జహీరాబాద్, భువనగిరి, చేవెళ్లలో ఐదుగురు చొప్పున, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్‌లో నలుగురు చొప్పున, కరీంనగర్, సికింద్రాబాద్‌లో ముగ్గురు చొప్పున , ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో ఇద్దరు చొప్పున నామినేషన్లు వేశారు.